ఉన్నత విద్యా వ్యాప్తిలో...
ఓపెన్ యూనివర్సిటీల పాత్ర కీలకం


ప్రొ.జి.రాంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సెంకా డైరెక్టర్ డా. బషీర్హమాద్ శాద్రచ్

హైదరాబాద్ సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా వ్యాప్తిలో ఓపెన్ యూనివర్సిటీల పాత్ర కీలకమని సెంకా డైరెక్టర్ డా.బషీర్హమాద్ శాద్రచ్ అన్నారు. దూరవిద్యా పితామహుడు ప్రొ.జి. రాంరెడ్డి జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శుక్రవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా "సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, విద్యా 4.0" అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. బషీర్హమాద్ మాట్లాడుతూ సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ఆన్‌లైన్, డిజిటల్ విశ్వవిద్యాలయాలకు దూరంగా ఉన్నాయని, సాంకేతిక, బ్లెండెట్, మెళుకువలు టీచింగ్, లెర్నింగ్ ప్రాక్టీస్‌లలో చాలా అభివృద్ధి చెందాయన్నారు. విశ్వవిద్యాలయ వీసీ ప్రొ.కె.సీతారామరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ప్రొ.రాంరెడ్డి దూర దృష్టి ఉన్నత విద్యా వ్యాప్తికి ఉపయోగపడిందన్నారు. విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ.ఏ.వి.ఎన్ రెడ్డిలు కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. ప్రొ.జి.రామ్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్, కార్యదర్శి ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ దూరవిద్యా వ్యాప్తికి ప్రొ.జి.రామ్ రెడ్డి చేసిన సేవలను భవిష్యత్ తరాలకు అందించేలా తమ ట్రస్ట్ ద్వారా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.జి.రాంరెడ్డి సతీమణి ప్రమీలా రాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పీజేఆర్ జయంతి

- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి విష్ణువర్ధన్ రెడ్డి


ఖైరతాబాద్ చౌరస్తాలో పీజేఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేయర్

ఎర్రగడ్డ/బోరబండ/యూసుఫ్‌గూడ/ పంజాగుట్ట/ ఖైరతాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నేత స్వర్గీయ పి. జనార్దన్ రెడ్డి (పీజేఆర్) జయంతిని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల్లోని కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పీజేఆర్ విగ్రహాలకు పూలమాల వేసి వారు ఘనంగా నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ మోహిసిన్ ఖురేషీ మాట్లాడుతూ పీజేఆర్ పేదల పెన్నిధిగా ప్రజలకు అండగా ఉంటూ వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. బోరబండలోని పలు బస్తీల్లో ఉన్న పీజేఆర్ విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూసుఫ్‌గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడుడ ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో వెంకటగిరి హైలం కాలనీలో పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రేమ్‌నగర్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు మద్దెల మురళీకృష్ణ, మోహన్ రాజు, అనిల్ రెడ్డి, సుఖదేవ్ లు కేక్ కట్‌చేశారు. .ఖైరతాబాద్‌లో పీజేఆర్ తనయుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఖైరతాబాద్ గ్రంథాలయ చౌరస్తాలో పీజేఆర్ కుమార్తె, కార్పొరేటర్ విజయారెడ్డి కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు.


గాలిపటాలతో చిన్నారులు

సంస్కార్ ది లైఫ్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ఎర్రగడ్డ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని విద్యార్థులు హరిదాసు వేషధారణలతో అలరించారు. శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో విద్యార్థులు ఆడి, పాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రంగోలి, గాలిపటాలు, పేపర్ దండల తయారీ తదితర ఈవెంట్లలో చురుకుగా పాల్గొన్నారు. చిన్నపిల్లలు గాలిపటాలను తయారు చేసి అబ్బురపరచారు. అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంక్రాంతి పిండి వంటకాలను ఆరగించారు. కార్యక్రమంలో సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహన వంశీ, ప్రిన్సినాల్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- అమీర్‌పేటలో నిర్మాణ దశలోనే కూలిన స్లాబ్ సెంట్రింగ్
- తప్పిన ప్రమాదం
- ఇంటి యజమానిపై కేసు నమోదు


కూలిన స్లాబ్ సెంట్రింగ్ డబ్బాలు

అమీర్‌పేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్‌లో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏలాంటి అనుమతులు లేకుండా ఆరు నుంచి 7 అంతస్తుల వరకు నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తాజాగా సత్యం టాకీస్ ఎదురు వీధిలో దాడి శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి 3 అంతస్తులకు అనుమతులు తీసుకుని 5 అంతస్తుల్లో ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో ఐదవ అంతస్తులో స్లాబ్ వేస్తుండగా, స్లాబ్ అంచున ఉన్న బీమ్‌కు అమర్చిన ఇనుప డబ్బాలు కిందపడి కాంక్రీట్ రోడ్డుపై పడింది. ఆ సమయంలో జనం లేక పోవడంతో ప్రాణపాయం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు.

న్యాయవాదుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు


మాట్లాడుతున్న ఐఎన్‌వైజేపీ జాతీయ అధ్యక్షుడు క్రాంతికుమార్

పంజాగుట్ట, జనవరి12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పోలీసులలు న్యాయవాదులపట్ల అనుచితంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఇండియన్ నేషనల్ యువ జన పార్టీ (ఐఎన్‌వైజేపీ)జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది క్రాంతికుమార్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోవాలి, లేకపోతే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు న్యాయవాదులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వృత్తిరీత్యా తమ క్లైంట్లను కలవడానికి పోలీస్‌స్టేషన్లకు వచ్చే న్యాయవాదుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వారిని బెదిరిస్తూ,అవమానలకు గురి చేస్తున్నారని అన్నారు. కొద్ది రోజుల క్రితం ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో సివిల్ కేసు విషయంలో న్యాయవాదితో అసభ్య పదజాలం ఉపయోగించిన ఘటనను ఉదాహరించారు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయని, న్యాయవాదులంటే అంత చులకననా అని ప్రశ్నించారు.వెంటనే ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి అధికారులకు సూచనలు చేసి పోలీస్ స్టేషన్లకు వచ్చే న్యాయవాదుల పట్ల మర్యాదగా ప్రవర్తించేలా చూడాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు కుమార్ యాదవ్, హర్ష, కామేష్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

వాటర్‌బోర్డు టీఎన్జీఓ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి12 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) డైరీ అధికారులు, ఉద్యోగులు ఆవిష్కరించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో టీఎన్జీవో అధ్యక్షుడు మహేశ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ముఖ్య అతిథిగా హాజరై.. నూతన డైరీ ఆవిష్కరించారు. అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ వాటర్‌బోర్డు టీఎన్జీఓ శాఖ తొలిసారిగా డైరీ అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించాలన్నారు. ఈ సందర్భంగా బోర్డులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో టీజీవో వాటర్ బోర్డు జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ హరిశంకర్, టీఎన్జీవో జనరల్ సెక్రటరీ అజయ్ సింగ్, ట్రెజరర్ నవీన్, ప్రతినిధులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు వీర భద్రయ్యకు అండగా 'మనం సైతం'

- రూ. 25 వేలు అందజేసిన ఫౌండేషన్ నిర్వాహకులు

బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారినపడిన నటుడు వీర భద్రయ్యకు మనం సైతం అండగా నిలబడింది. మనం సైతం ఫౌండేషన్ నిర్వాహకులు కాదంబరి శుక్రవారం వీర భద్రయ్య కుటుంబానికి రూ.25 వేలు నగదు అందజేశారు. కాదంబరి కిరణ్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో పనిచేస్తున్న పేద కార్మికులకు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సహాయం చేసేందుకు మనం సైతం ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు అనేక మంది కళాకారులకు సహాయం అందజేసినట్టు కాదంబరి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ నందినగర్‌లో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు చిట్టచివరగా ఉన్న పేద వారికీ కూడా అందేలా వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.


అమీర్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పంజాగుట్ట/అమీర్‌పేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత విద్యాభ్యాసంతోపాటు సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని జాతీయ భావాన్ని పెంపొందించాలని, పంజాగుట్ట ప్రేమనగర్ బస్తీ ప్రధానకార్యదర్శి భగవాన్‌దాస్ అన్నారు. జాతీయ విలువలు కలిగిన పౌరులుగా, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జీవన విధానాన్ని కలిగి ఉండాలని ఏబీవీపీ ఐకాన్ కావ్యరెడ్డి అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమీర్‌పేట డివిజన్‌లో కావ్యరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 2వందల మంది యువకులు బ్యానర్లు చేతబట్టి ఎస్ఆర్‌నగర్ ఎస్‌బీఐ నుంచి సత్యం టాకీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం, ప్రేమనగర్ మహిళా మండలి, ప్రేమ్‌నగర్ స్లం లెవెల్ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

బైకును ఢీకొట్టి.. లాక్కుపోయిన కారు...

బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వచ్చిన కారు... ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పదిహేను అడుగుల దూరం లాక్కుపోయింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సికింద్రాబాద్‌కు చెందిన మెల్విన్ సునీల్ కాగ్నిజెంట్ సంస్థ లీగల్ అధికారిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న విధులు ముగించుకొని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కార్యాలయం నుంచి సికింద్రాబాద్‌కు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు.

జూబ్లీహిల్స్‌రోడ్డు నెంబరు 45కు రాగానే వెనుకాల నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టి, వాహనాన్ని 15 అడుగుల వరకు లాక్కుపోయింది. దీంతో సునీల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నాం : స్వాతి లక్రా

యూసుఫ్‌గూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని బెటాలియన్‌లలో పోలీసులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇంకా ఎక్కడైనా కొరత ఉంటే వాటిని గుర్తించి ఏర్పాటు చేస్తామని టీఎస్ఎస్‌పీ అదనపు డీజీపీ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడ ప్రథమ పటాలంలో పునర్నిర్మించిన అర్ట్స్ అండ్ కల్చరల్ ఓపెన్ థియేటర్(బిగ్ థియేటర్)ను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఇక్కడ మిత్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, దానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ ప్రొగ్రామ్ పోలీసు కుటుంబాలకు ఆరోగ్యానికి, ఆదాయానికి ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం బెటాలియన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంక్షేమ భవనం, వాటర్ ప్లాంట్‌లను స్వాతి లక్రా ప్రారంభించారు. మంజీరా కమ్యూనిటీ హాల్‌లో ఆర్మర్ బేసిక్ కోర్సు 2వ బ్యాచ్ వీడ్కోలు సభలో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 32 మందికి ధ్రువపత్రాలను అందించారు. బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, అదనపు కమాండెంట్ నరేందర్ సింగ్ పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జాన్


నియామక పత్రం అందజేస్తున్న చెన్నయ్య

పంజాగుట్ట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పప్పుల జాన్ నియమితులయ్యారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. మాల మహానాడు నూతన కమిటీ లు ఏర్పాటుచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని చెన్నయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు మన్నే శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు తాలూక రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1,2 తేదీల్లో చలో ఢిల్లీ

పంజాగుట్ట, జనవరి12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఫిబ్రవరి 1, 2 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాదిగ సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తమ డిమాండ్లపై ఈ నెల 22న సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామన్నారు. ఏఐసీసీ నాయకులతోపాటు సోనియాగాంధీ తదితరులను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో టీఎస్ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మహా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎం.నర్సింగరావు, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక అధ్యక్షుడు వి.సోమ చంద్రశేఖర్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి: సంగీత

బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని కీర్తి అపార్ట్‌మెంట్స్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి ఆమె శుక్రవారం పర్యటించారు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయగా, నూతన పైప్‌లైన్ కోసం నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

48 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి

బేగంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో 48 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బేగంపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా రైల్వే స్టేషన్ సమీపంలోని బస్టాండ్ వద్ద పంగి జోగినాయుడు, పూజారి లావణ్య, పంగి కిరోమణి అనుమానాస్పదంగా కనిపించడం తో తనిఖీ చేశాం. వారి వద్ద ఉన్న 4 బ్యాగుల్లో 40 కిలోల ఎండు గంజాయి బయటపడింది. నిందితులను విచారించగా విశాఖపట్నం జిల్లా.. అరకులో కిలో గంజాయి రూ.2,750కి కొనుగోలు చేసి, నగరానికి తీసుకొచ్చి రూ.10,000లకు విక్రయిస్తున్నట్టు అంగీకరించారు. ముగ్గురిని అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో కేసులో డీటీఎఫ్ సికింద్రాబాద్, సీఐ శివజ్యోతి అధ్వర్యంలో సిబ్బంది రైల్వే స్టేషన్ సమీపంలోని మాతాగుడి వద్ద నిర్వహించిన తనిఖీల్లో బిహార్ రాష్ట్రానికి చెందిన వివేక్ సాహ్ని వద్ద 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామని సూపరింటెండెంట్ పవన్ కుమార్ తెలిపారు.

టీ అంజయ్య నగర్‌లో 1.4 కేజీలు...

అమీర్‌పేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎండు గంజాయి విక్రయిస్తున్న అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.4కేజీల ఎండు గంజాను స్వాధీనం చేసుకున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన అజయ్ రాయ్ అలియాస్ అజయ్‌కుమార్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీఆర్ హిల్స్ టి. అంజయ్య నగర్‌లో నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 31న బిహార్‌కు వెళ్లిన అజయ్‌రాయ్.. 2 కిలోల ఎండు గంజాయి తీసుకుని జనవరి 8న నగరానికి వచ్చాడు. దానిని చిన్నచిన్న పొట్లాల్లో పెట్టి అవసరమైన వారికి విక్రస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి అజయ్ రాయ్‌ను అరెస్ట్ చేశారు. దాదాపు రూ.30 వేల విలువ గల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

కత్తితో బెదిరించి నగదు, సెల్‌ఫోన్‌తో పరారీ

- ఐదు గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు

బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు డెలివరీ బాయ్‌ను కత్తితో బెదిరించి నగదు, ఒన్ ప్లస్ సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. గాంధీనగర్‌కు చెందిన మంగళంపల్లి కిరణ్ జొమాటోలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి హకీంపేటలోని సబ్‌వే వద్ద కస్టమర్‌కు ఫుడ్ డెలివరీ ఆర్డను ఇచ్చేందుకు రాగా, వెనుక నుంచి వచ్చిన ముగ్గురు యువకులు అతడిని అడ్డగించారు. కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి కిరణ్ జేబులో ఉన్న దాదాపు ఇరవై వేలు చేసే ఒన్ ప్లస్ సెల్‌ఫోన్, రూ.500 నగదు తీసుకుని పారిపోయారు. బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, రెండు బృందాలు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలని పరిశీలించారు. నిందితుల ఆనవాళ్లను గుర్తించిన పోలీసులు మంగళ్‌హాట్‌కు చెందిన షేక్ ఫయాజ్, హుమాయున్‌నగర్‌కు చెందిన అబ్బాస్ అలీ, మహ్మద్ ఆరీఫుద్దీన్ అదుపులోకి తీసుకుని విచారించగా దారి దోపిడీలకు పాల్పడుతున్నట్టు అంగీకరించారు. ఘటన జరిగిన 5 గంటల్లోనే పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పబ్‌లో యువకులు, బౌన్సర్ల మధ్య గొడవ

- పరస్పర ఫిర్యాదులతో కేసు నమోదు


బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పబ్‌కు వచ్చిన యువకులు, బౌన్సర్ల మధ్య జరిగిన గొడవలో భాగంగా పరస్పర ఫిర్యాదులతో బంజారాహిల్స్ పోలీసులు రెండు వేర్వేరు కేసులను నమోదు చేశారు. కార్వాన్‌కు చెందిన దర్గా అఖిల్ కూరగాయల వ్యాపారి. ఈ నెల 11న బర్త్‌డే కావడంతో అతని స్నేహితులు హరీష్, ఉత్తమ్, సూర్యప్రకాశ్, సురేష్, సిద్ధు, అఖిల్, వెంకట్ తదితరులు ఇంటికి వచ్చి కేక్ కట్ చేయించారు. అనంతరం అందరూ పబ్‌కు వెళదామని భావించారు. ముందుగా బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 10లోని ఓ మద్యం దుకాణం వద్దకు వచ్చి మద్యం తాగారు. అనంతరం రోడ్డు నెంబరు 14లోని ఆఫ్టర్ 9 పబ్‌కు వచ్చారు. అక్కడ ఉన్న బౌన్సర్లు ఎంట్రీ ఫీజు అడగగా రూ.7,500 చెల్లించారు. అనంతరం అతని మిత్రుల్లో ఒకరైన హరీష్‌ను బౌన్సర్లు అడ్డగించారు. మైనర్ అయి ఉంటాడని ఐడీ చూపాలని కోరారు. దీనికి హరీష్ తాను ఐడీ తేలేదు అని చెప్పాడు. మాటామాటా పెరగడంతో హరీష్ బౌన్సర్లను కొట్టేందుకు చేతులు లేపగా మిగతా వారు వారించారు. ఇంతలో బౌన్సర్లు కర్రలతో హరీష్‌ను తీవ్రంగా కొట్టడంతో అతడు గాయపడ్డాడు. దర్గా అఖిల్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బౌన్సర్లపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా హరీష్‌తోపాటు అన్ని స్నేహితులు తమపై అకారణంగా దాడి చేశారని పబ్ బౌన్సర్లు ఫిర్యాదు చేయగా పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

సినీ నిర్మాతను అగౌరవ పరిచేలా పోస్టులు

- రైటర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాతను అగౌరవ పరిచేలా పోస్టులు పెట్టడంతో సోషల్ మీడియాలో దూషణలకు దిగిన సినీ రచయితపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 76లో నివసించే కూచిబొట్ల సుబ్రహ్మణ్య వివేకానంద సినీ నిర్మాత. కొద్ది కాలం క్రితం తాడినాట రాజనర్సింహ అనే రచయిత కలిసి తన వద్ద కథలు ఉన్నాయని చెప్పాడు. కొన్ని కథలను విన్నాక అవి నచ్చకపోవడంతో వివేకానంద సినిమా వరకు తీసుకువెళ్లలేకపోయారు. దీన్ని దృష్టిలోపెట్టుకొని రాజనర్సింహ తప్పుడు ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. కొద్ది కాలానికి తన వల్ల పొరపాటు జరిగిందని ఒప్పుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెప్పడంతో వివేకానంద లక్ష రూపాయలు ఇచ్చాడు. మరోసారి కథల గురించి ప్రస్తావించడంతో వివేకానంద టెక్నికల్ సిబ్బందికి వినిపించాలని సూచించాడు. రాజనర్సింహ చెప్పిన కథలు సిబ్బందికి నచ్చలేదు. దీంతో సినిమా తీయలేమని రాజనర్సింహకు చెప్పాడు. ఇదే విషయమై వివేకానందను కలిసేందుకు ప్రయత్నించగా కుదరలేదు. దీంతో వివేకానంద్ గౌరవాన్ని భంగపరిచేలా రాజనర్సింహ సోషల్ మీడియా పోస్టులు పెట్టడం ప్రారంభించాడు. బెదిరింపు ధోరణిలో మాట్లాడాడు. వివేకానంద ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రాజనర్సింహపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పతంగుల పండుగొచ్చింది..



ఎర్రగడ్డ మసీద్ గల్లీలో 365 రోజులూ అమ్మకాలు


ఎర్రగడ్డ జనప్రియ అపార్ట్‌మెంట్స్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన గాలిపటాల దుకాణం

ఎర్రగడ్డ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే గాలిపటాలు ఎగరవేత. పతంగులు ఎగరవేయడానికి చిన్నాపెద్దా అందరూ ఎంతో ఇష్టపడతారు. సంక్రాంతి పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి గాలిపటాల ఆటలు. సంక్రాంతి పండుగకు ముందు, తరువాత చాలా రోజుల వరకు గాలిపటాలు ఆకాశంలో ఎగురుతుంటాయి. మాంజా, చరఖా, దారం సహాయంతో గాలిపటాలను గాలిలో ఎగురవేస్తూ ఉంటారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎర్రగడ్డలోని పలు ప్రాంతాల్లో గాలిపటాల అమ్మకాలు జోరుగా సాగుతోన్నాయి. ఎర్రగడ్డలోని మసీదు గల్లీలో ప్రాంతంలో సంవత్సరం పొడవునా గాలిపటాల అమ్మకాలు జరుపుతుండగా, ప్రస్తుతం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనప్రియ అపార్ట్‌మెంట్స్ పక్కన గల పార్క్ ప్రాంతంలో, హేమవతినగర్ చౌరస్తాలో, ఎర్రగడ్డలో ఈ గాలిపటాల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వివిధ రంగుల గాలిపటాలతో పాటు దుకాణాల్లో ఉంచిన చరఖాలు, మాంజా, దారాలు కొనేందుకు వస్తున్న వినియోగదారులతో దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి.

ప్రమాదాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలిపటాలు ఎగురవేయడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం కూడా సంభవిస్తుంది. ఎక్కువ ప్రమాదాలు మాంజా, దారం తయారీలో వాడే గాజు పొడి మూలంగా జరుగుతాయి. దీని వల్ల ఎగురవేస్తున్న వారు వేలు కోసుకోవడం వంటి ప్రమాదాలు జరుగుతాయి. తెగిపోయిన గాలిపటాన్ని పట్టుకోవడానికి పరుగెత్తడంలో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశాలు కూడా ఉంటాయి. మేడపై భాగం నుంచి గాలిపటాలు ఎగురవేస్తున్నప్పుడు కింద పడే ప్రమాదాలు కూడా అధికంగా ఉంటాయి. వర్షాకాలంలో గాలిపటాలు ఎగురవేస్తున్నపుడు తడిగా ఉండే దారం విద్యుత్ తీగలకు తగులుకుని ఎగురవేస్తున్న వ్యక్తి విద్యుత్ ప్రమాదానికి కూడా గురికావచ్చు. ముఖ్యంగా గాలిపటాలు ఎగురవేసేటపుడు మాంజా వేళ్లను కోసుకోకుండా వేళ్లకు రక్షణగా తొడుగును ఉపయోగించడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖులు చెబుతున్నారు. రెయిలింగ్ ఉన్న మేడలపై మాత్రమే పతంగులు ఎగురవేసేలా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు. తెగిన గాలిపటాలను పట్టుకోవడానికి ఆత్రుతగా పరిగెత్తవద్దని వెనుకా ముందు చూసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

జోరుగా అమ్మకాలు



ప్రతి సంవత్సరం ఇక్కడ గాలిపటాల విక్రయాలను జరుపుతుంటాం. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పండుగకు ముందు, వెనుక నెలరోజుల పాటు గాలిపటాలను విక్రయిస్తుంటాం. ప్రస్తుతం పంతగులు అమ్మకాలు ప్రస్తుతం జోరుగానే నడుస్తున్నాయి. ఓల్డ్ సిటీ తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పతంగులు కొనుగోలు చేస్తుంటారు. గాలిపటాలు, మాంజా తయారీలను స్వతహాగా తయారుచేసి అమ్ముతుంటాం.

\- మొహమ్మద్ సలీం, గాలిపటాల దుకాణదారుడు

చైనా మాంజ అమ్మినా.. కొన్నా కేసులు : ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్

ఖైరతాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా దుకాణదారులు చైనా మాంజాను అమ్మినా, కొన్నా కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతికి సొంతూర్లకు వెళ్లే వారు పోలీసులకు, తెలిసిన వారికి సమాచారం అందించాలని, ఇంట్లో విలువైన బంగారం, నగదు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. గాలిపటాలను ఎగురవేసేవారు మేడలపై ఉండే పిట్ట గోడల వద్ద జాగ్రత్తలు వహించాలని, కింద పడకుండా పతంగులను ఎగురవేయాలని, డీజేలకు అనుమతి లేదని అన్నారు. ప్రజలు ఫిర్యాదుల కోసం 8712665185 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎగుర వేయడంతో ఆనందం



సంక్రాంతి సమయంలో గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందాన్ని పొందుతుంటాం. పండుగకు కొన్ని రోజుల ముందు నుంచి పతంగులు కొనుగోలు చేస్తాం. గాలిపటాలు ఎగురవేస్తు ఆకాశంలో మరొక గాలిపటాన్ని పెయించ్ వేసి కట్ చేసి ఆనందపడుతుంటాం. అలా కట్ చేసిన గాలిపటాలను లెక్కిస్తూ ఎవరు ఎక్కువ గాలిపటాలను తెంపుతారోనని పోటీలు పెట్టుకుని మరీ ఇతర గాలిపటాలను కట్ చేసి అమితానందం పొందుతుంటాం. మాంజా సామర్థ్యాన్ని బట్టి ఎక్కువ గాలిపటాలను కట్ చేస్తుంటాము. చిన్న పిల్లలతో పాటు ప్రతీ ఒక్కరు ఈ గాలిపటాల పండుగలో ఆనందాన్ని పొందుతుంటారు.

\- చిరంజీవి బి.శంకర్‌లాల్ నగర్, వినియోగదారుడు

వాడీవేడిగా కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం



కంటోన్మెంట్ పాలకమండలి సమావేశంలో మధుకర్ నాయక్, జె.రామకృష్ణ, లాస్య నందిత తదితరులు

సికింద్రాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలకు పన్ను, జరిమానాలు విధించడం ద్వారా అక్రమార్కులను కొంతమేర కట్టడి చేయవచ్చంటూ సీఈఓ మధుకర్ నాయక్ ప్రతిపాదనలు, క్రమబద్ధీకరిస్తేనే జరిమానాలు విధించాలని, లేకపోతే ఆస్తిపన్ను మాత్రమే వసూలు చేయాలని నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సూచించడం, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని సీఈఓ ప్రతిపాదన చేయగా, అతి ఖరీదైన ఆ స్థలాన్ని ఉచితంగా ఎలా కేటాయిస్తారంటూ రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేయడం, పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం... వెరసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం వాడి వేడిగా సాగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలోని డిఫెన్స్ ఎస్టేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఆంధ్రా, తెలంగాణ సబ్ ఏరియా కమాండర్, బ్రిగేడియర్ సోమశంకర్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ ఆకాష్‌శర్మ, ఎక్స్‌అఫీషియో సభ్యురాలు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత ఉన్నతాధికారి విజయకుమార్ బి.నాయర్‌లు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో అక్రమ నిర్మాణాలకు (కంటోన్మెంట్ చట్టం 248/320 సెక్షన్) కింద జారీ చేసే నోటీసులపై వాడి వేడి చర్చ జరిగింది. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని సెక్షన్ 248 కింద నోటీసులు జారీ చేసినా.... అక్రమార్కులు స్పందించడంలేదని, అందుకే నెలరోజుల గడువు తర్వాత సెక్షన్ 320 నోటీసు జారీ చేయాలని ప్రతిపాదించినట్టు మధుకర్ నాయక్ వెల్లడించారు. దీనికి రామకృష్ణ అభ్యంతరం తెలుపుతూ, బోర్డు ఆమోదం లేకుండా 320 నోటీసులు ఎలా జారీ చేస్తారంటూ ప్రశ్నించారు. మధుకర్ నాయక్ స్పందిస్తూ... మూడు, నాలుగు నెలలకోసారి జరిగే బోర్డు పాలక సమావేశం వరకు వేచి చూస్తే. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయలేమని, యథేచ్ఛగా నిర్మాణాలు పూర్తి చేసుకుంటారని అభిప్రాయపడ్డారు. కాగా బోర్డు అధికారాలను సీఈఓ మధుకర్ నాయక్ తన చేతుల్లోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణదారుల నుంచి పన్ను వసూలు చేయడంతోపాటు జరిమానాలు విధించాలని సీఈఓ ప్రతిపాదించగా, రామకృష్ణ వ్యతిరేకించారు. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తేనే జరిమాన విధించాలని, లేకపోతే ఎలా విధిస్తారని అభ్యంతరం తెలిపారు. దీంతో పెనాల్టీ అంశాన్ని పక్కన పెట్టాలని నిర్ణయించారు.

విలువైన స్థలాన్ని ఉచితంగా ఇస్తాం రామకృష్ణ

హస్మత్‌పేట్‌లోని 28 ఎకరాల ట్రెంచింగ్ యార్డు స్థలాన్ని కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణం నిమిత్తం కేటాయించాలని సీఈఓ మధుకర్‌నాయక్ ప్రతిపాదించారు. చాలా ఏళ్ల క్రితమే ఈమేరకు ప్రతిపాదనలు ఉన్నాయని, రక్షణ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లిందని ఆయన తెలిపారు.

బోర్డు పాలకమండలి తీర్మానం చేసి, ఈమేరకు ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. దీనికి నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ఉద్యోగులకు ఉచితంగా ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఉద్యోగులకు ఇవ్వాలి, అసలు బోర్డు ఉద్యోగులు సొసైటీని ఏర్పాటు చేసుకున్నారా, ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర ప్రకారం ఉద్యోగులకు స్థలాన్ని కేటాయించడం సబబుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆ అంశాన్ని పక్కన పెట్టాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. కొన్ని భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేశారు.

హెల్త్ విభాగానికి తొలి గ్రాడ్యుయేట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఉద్యోగుల నియామకాలకు నాటి నిబంధనలనే పాటిస్తూ వచ్చారు. కీలకమైన విభాగాల ఉన్నతాధికారులు కూడా పదో తరగతి కనీస విద్యార్హతతో నియమితులు కావడం గమనార్హం. కాగా తాజాగా హెల్త్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన ఎం.దేవేందర్ తొలి పోస్ట్ గ్రాడ్యుయేట్ కావడం విశేషం. ఆదిలాబాద్ జిల్లా లింబాకి గ్రామానికి చెందిన దేవేందర్ స్థానికంగా పాఠశాల విద్యను, నర్సాపూర్‌లో జూనియర్ కళాశాల విద్యను అభ్యసించారు.



దేవేందర్

నగరంలోని సిటీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) పూర్తి చేశారు. గాంధీ వైద్య కళాశాలలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శిక్షణ పూర్తిచేశారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ద్వారా 1991లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఉద్యోగిగా చేరారు. ఆయనతోపాటు ఏనుగు రవీందర్‌రెడ్డి, ముస్తఫా, అఫ్జల్, మహేందర్‌లు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా ఉన్నారు. అయితే వీరిలో ఏనుగు రవీందర్‌రెడ్డి రాజీనామ చేసి, రాజకీయాల్లో చేరి, శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ముస్తఫా చాలా కాలం క్రితం కన్నుమూశారు.

అఫ్జల్ ప్రస్తుతం పదవీ విరమణ చేయనున్నారు. దాంతో దేవేందర్‌కు పదోన్నతి లభించింది. కాగా పోస్టు గ్రాడ్యుయేట్ కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్‌గా నియమితులు అవుతుండడం పట్ల అటు ఉద్యోగులు, ఇటు సాధారణ ప్రజానీకంలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సహచర అధికారులు, ఉద్యోగులు శుక్రవారం దేవేందర్‌ను అభినందించారు.

కీలక విభాగాల అధికారులకు పదోన్నతులు

మూడు కీలక విభాగాలకు చెందిన ముగ్గురు అధికారులు రాబోయే మూడు నెలల్లో పదవీ విరమణ చేయనుండడంతో వారి స్థానంలో ఇతర అధికారులకు పదోన్నతి కల్పిస్తూ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. పలు అంశాలపై తీర్మానం చేసిన సభ్యులు.... అధికారుల పదోన్నతులపై సైతం చర్చించి, ఆమోదం తెలిపారు.

కంటోన్మెంట్ బోర్డు సర్వెంట్స్ రూల్స్ ప్రకారం వారి స్థానాల్లో తదుపరి హోదాల్లో ఉన్న సీనియర్ అధికారులకు పదోన్నతి కల్పిస్తుంటారు. కేంద్ర సర్వీసులకు చెందిన సీఈఓ, డిప్యూటీ సీఈఓ, జాయింట్ సీఈఓల తర్వాత ఆఫీస్ సూపరింటెండెంట్ సీటు కీలకమైంది. ప్రస్తుతం ఆఫీసు సూపరింటెండెంట్‌గా ఉన్న అక్బర్ అలీ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండగా, ఆయన స్థానంలో ట్యాక్స్ సూపరింటెండెంట్ యానీని నియమించేందుకు ఆమోదం తెలిపారు. హెల్త్ సూపరింటెండెంట్ అఫ్జల్ మొహియుద్దీన్ సైతం ఈనెలాఖరున పదవీ విరమణ చేయనుండగా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్‌ను నియమించనున్నారు. దేవేందర్ స్థానంలో సీనియర్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్‌ను నియమించాలని బోర్డు సమావేశంలో తీర్మానించారు.

రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ యూనివర్సిటీలు

● ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



విజేతలకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

రాంగోపాల్‌పేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పీవీ మార్గ్‌లోని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జాబ్‌మేళాను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ఎంచుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని సంకల్పించిందని, ప్రైవేట్ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి యువతకు శిక్షణ అందిస్తామన్నారు. నిరుద్యోగ యువత కోసం పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన శాఖ ముఖ్య కార్యదర్శి సవ్యసాచి ఘోష్, రాష్ట్ర యువజన శాఖ సంచాలకులు డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు, టీస్ స్టెప్ జనరల్ మేనేజర్ కే.వేణుగోపాల రావు పాల్గొన్నారు.

ఎలక్ట్రో హోమియోపతి రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గంగాధర్



డా.జి.గంగాధర్

పద్మారావునగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రో హోమియోపతి వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వి.సుభాష్, కోశాధికారిగా డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ సి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.శంకర్ గౌడ్, సైంటిఫిక్ సలహాదారుడిగా డాక్టర్ ఎం.వేణుచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ ఎలక్ట్రో హోమియోపతి వైద్య విధానంతో దీర్ఘకాలిక వ్యాధులకు దుష్ప్రభావాలు లేని చికిత్స లభిస్తుందని తెలిపారు. తెలంగాణలో ఇలాంటి వైద్యానికి ఆదరణ పెరుగుతోందని, దానికి మరింతగా ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎలక్ట్రో హోమియోపతిలోకి కొత్తగా వస్తున్న డాక్టర్లకు శిక్షణ అందిస్తున్నామని, పేదల కోసం బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

చిలకలగూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రతినిధులు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ని కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ ఛాంబర్‌లో ఆయనని కలిసి రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఫెడరేషన్ సావనీర్ అందజేసి, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఆర్ఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి పి.యుగంధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, బాబురావు, వెంకటేశ్వర్లు, పూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

తార్నాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ దృక్పథం, శాస్త్రీయ అధ్యయన పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో అమెరికాలోని హార్వర్డ్ కళాశాల, ఓయూతో కలిసి చేపట్టిన ప్రోగ్రాం ఫర్ సైంటిఫికల్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ పేరుతో ఓయూలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి బుర్రా వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ దృక్పథం, శాస్త్రీయ అధ్యయన పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర విద్యాశాఖ ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేన, ఓయూ వీసీ డా.రవీందర్, ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొ.డొమినిక్ మావే, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, ఓయూ యూజీసీ డీన్ ప్రొ.మల్లేషం, ప్రొ.మంగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన

చిలకలగూడ,జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మెట్టుగూడలో శుక్రవారం ఆటో, క్యాబ్ డ్రైవర్లకి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు నియమనిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా ఖాకీ డ్రెస్ వేసుకోవాలని, అధిక ప్యాసింజర్లను ఎక్కించుకోరాదని, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేయరాదని చిలకలగూడ, ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సబ్‌ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఈ కార్యక్రమమంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం

● కాంగ్రెస్ నాయకురాలు వెన్నెల



విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న గద్దర్ కూతురు వెన్నెల

అడ్డగుట్ట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి తన తండ్రి గద్దర్‌లా బతికి పోరాటం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు, కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే వెన్నెల అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.యాదగిరి నేతృత్వంలో జరిగిన "ప్రజాస్వామ్య విజయోత్సవ సభ"లో ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల మాట్లాడారు. గత తెలంగాణ ప్రభుత్వంలో పేద ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యారన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజలకు రావల్సిన పథకాలు అర్హులైనవారికి అందలేదన్నారు. యుద్ధం మొదలైతే ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొత్త ప్రభుత్వంలో సీఎంగా రేవంత్‌రెడ్డి మన కోసం వచ్చాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోళ్లకు న్యాయం జరుగుతుందని భావించి తాను మీ కోసమే కాంగ్రెస్ పార్టీకి వచ్చామన్నారు. ఆమె తన తండ్రి పాడిన "నిండు అమాసనాడు ఓ లచ్చగుమ్మడి" అనే పాట పాడడంతో సభలో మహిళలు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.యాదగిరి మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి చూపించే సత్తా రేవంత్‌రెడ్డికి ఉందన్నారు. సభకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నగేష్, నందికంటి రవి, సత్తమ్మలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



సాయి విద్యాలయ ఆధ్వర్యంలో ..



గాంధీ ఆస్పత్రిలో రంగోలి వేడుకలు ..



బొల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో

బౌద్ధనగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సీతాఫల్‌మండి బీదలబస్తీలో శుక్రవారం శ్రీసాయి విద్యాలయ హైస్కూల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు రంగు, రంగుల ముగ్గులను వేశారు. ముగ్గులు వేసిన విద్యార్థినులకు స్కూల్ కరస్పాండెంట్ కె.వెంకటేశ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట : సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రంగోలి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్పత్రి ప్రాంగణంలో ముగ్గులు వేసి సంబురాలు జరుపుకున్నారు. స్వామి వివేకానంద విగ్రహానికి గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు పూలమాలవేసి నివాళర్పించారు. ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రొఫెసర్ శోభన్‌బాబు, ఆర్‌ఎంఓ జయకృష్ణ పలువురు విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : బొల్లారం సదర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు హెడ్ మాస్టర్ హెచ్ శ్రీలత బహుమతులు అందజేశారు.



కూడారై మహోత్సవానికి బోయిన్‌పల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెండి గంగాలాలను అందిస్తున్న భక్తురాలు శారద

ఘనంగా కూడారై మహోత్సవం

బోయిన్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలోని మూలవిరాట్ వెంకటేశ్వరస్వామి అండాలమ్మ అమ్మవారిని మండపం వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు, , తిరుప్పావై వ్రతాలను ఆచరించారు. అనంతరం భక్తుల హారతులు నామస్మరణలతో స్వామివారిని ఆలయంలోకి తీసుకువెళ్లి వేడుకలు నిర్వహించారు. అనంతరం కూడారై మహోత్సవం కోసం ఆలయ అర్చకులు పవన్‌స్వామి, దీపక్ స్వామిలు స్వామివారిని మత్స్య అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకారంతో స్వామివారు దర్శనమివ్వడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కూడారై మహోత్సవం కోసం ప్రత్యేకంగా తయారుచేసి విశేష క్షీర పరమాన్నం ప్రసాదాన్ని శారద అనే భక్తురాలితోపాటు మరో భక్తురాలు అందించిన 108 గంగాళం పాత్రలలో స్వామి, అండాలమ్మ వారికి నివేదన చేశారు. సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలకు పరమాన్నం ప్రసాదం పాత్రలను అందించారు. అనంతరం అండాలమ్మ అమ్మవారికి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని బంగారు కవచాలతోపాటు మత్స్య స్వర్ణాలంకృతులుగా భక్తులకు స్వామివారు దర్శనం ఇచ్చారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం జరిగింది. ఆదివారం గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణంను అంగరంగ వైభవంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

ఘనంగా పీజేఆర్ జయంతి



పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ డిబి దేవేందర్, జంపన ప్రతాప్ పార్టీ శ్రేణులు, అభిమానులు

మారేడ్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేదల అభ్యున్నతి కోసం నిరంతరం సేవలందించిన ఘనత పీజేఆర్‌కి దక్కుతుందని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యానారాయణ కొనియాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీబీ దేవేందర్ అధ్వర్యంలో శుక్రవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జేబీఎస్ చౌరస్తాలోని పీజేఆర్ విగ్రహానికి కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పి.రామ్ కుమార్ పారిశుద్ధ్య కార్మికులకు ఈ సందర్భంగా చీరలు పంపిణీ చేశారు. అనంతరం పీజేఆర్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణుల నడుమ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లు కిషన్, మర్రి అమరేందర్ రెడ్డి, ఆకుల నాగేష్, సీపీఐ నరసింహ, మాజీ కార్పొరేటర్ వసంత, వరద రాణి, సీనియర్ నాయకులు ముప్పిడి గోపాల్, నంది కంటి రవి, పాండు, నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడిని రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ఔషాపూర్ గ్రామానికి చెందిన షేక్‌ఫీర్ పాషా (71) శుక్రవారం ఘట్‌కేసర్- బీబీనగర్ రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివేకానందుడి సిద్ధాంతాలను యువత ఆచరించాలి

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



బోయిన్‌పల్లిలోని స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జంపన ప్రతాప్‌తో వివేకానంద అసోసియేషన్ సభ్యులు



పికెట్ స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ముఖ్య అతిథిగా హైకోర్టు జస్టిస్ ఎం.ఆర్.ఎస్ సూరిపల్లి నంద, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ వెన్నెల, పలువురు ప్రముఖులు - మారేడ్‌పల్లి, సికింద్రాబాద్



బొల్లారంలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనంజయ చారి తదితరులు

బౌద్ధనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద సిద్ధాంతాలను యువత ఆచరించాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం నాయకుడు భాస్కరగిరి ఆధ్వర్యంలో శుక్రవారం వారాసిగూడ శివాజీ విగ్రహం నుంచి లాలాపేట వరకు నిర్వహించే ర్యాలీని ఆయన ప్రారంభించారు. అంతకుముందు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని బోయిన్‌పల్లి స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ అధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు భాస్కర్ రెడ్డి, శశిరాజ్, గౌరా కుమార్, జ్ఞాన ప్రకాష్ యాదవ్, ప్రకాష్ యాదవ్, మల్లేష్, జితేందర్, ముత్యాలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : బొల్లారం వివేకానంద కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనంజయ చారి, జేవీ.నర్సింగరావు, యోగేష్, వార్డ్-8 బీజేపీ నాయకుడు జాయినపల్లి శ్రీకాంత్, శ్రీనివాస్ యాదవ్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జీవీ బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.